# ప్రేమలూ - పెళ్ళిళ్లూ

వేదమంత్రాలు లేవు. వేదోక్త ఆశీర్వచనాలు లేవు. పురోహిత బ్రాహ్మల హడావిడి అసలేలేదు. ఎదురు సన్నాహం, తోటలో విడిది లేదు. పల్లకీలేదు, బోయీలులేరు. బాజాభజంత్రీలు అసలేలేవు. వియ్యాల వారి సనుగుళ్ళు లేవు. కట్నాలు లేవు. కానుకలు అంతకంటే లేవు. భోజనాల హడావిడిలేదు. విందులు వినోదాల ఖర్చులులేవు. అలకపాన్పులు లేవు. దండాడింపు, అగ్నిహోత్రాలు, అప్పగింతలు "పోయి రావమ్మ జానకీ" సన్నాయిహోరు వినిపించవు. ఆడబడుచు అత్తగార్ల లాంఛనాలు లేవు. మనుగుడుపులు లేవు, పెళ్ళి కొడుక్కి జంధ్యంలేదు. పెళ్ళికూతురికి నల్లపూసతాడూ లేదు. కాళ్ళకు పారాణిలేదు. బుగ్గన చుక్కలులేవు. మధుపర్కాలులేవు. పానకపు బిందెలు, అత్తగారికి ఆడపడుచులకు మొగం కడిగించే కార్యక్రమాలులేవు. జీలకర్రా బెల్లం నెత్తిమీద పెట్టడాలులేవు. గాడిపొయ్యి తవ్వక్కర్లేకుండా, పందిరి వేయక్కర్లేకుండా చాలా సింపులాతి సింపుల్‌గా ఈమధ్య పెళ్ళిళ్ళు జరిగిపోతున్నాయి. పెద్దవాళ్ళ ప్రమేయం లేకుండా నవయువతరం పూలదండలు మార్చుకుని పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. వారి పెళ్ళికి వారే ముహూర్తాలు పెట్టుకుంటున్నారు. శుభలేఖలో "మా పెళ్ళి మీరు రండి" అంటున్నారు. కింద వాళ్ళే ముద్దుగా సంతకాలు పెడుతున్నారు. తీరా అక్కడకు వెళ్ళాక చిన్న మీటింగుకి వెళ్లినట్లు వుంటోంది. అక్కడ పెళ్ళి కూతురి చిరునవ్వులే పెళ్ళికొడుకు నెమ్మదిగా చేసే పలకరింపులే వచ్చినవారికి విందు భోజనాలు, రిజిస్ట్రారో అధ్యక్షుడో రెండు మంచి మాటలు చెప్పి ఆశీర్వదిస్తారు. అబ్బాయి అమ్మాయి ప్రమాణ స్వీకారం చేస్తారు. పూలదండలు, చప్పట్లు బస్ - పెళ్ళి అయిపోయింది. వధూవరులు వచ్చి అతిధులతో కలిసి కాఫీ ఫలహారాలు తీసుకుంటారు. క్లబ్బు మేడమీద కాని, స్కూల్లోకాని, ఏ హాల్లోనైనా జరగవచ్చు ఒక పూట కార్యక్రమం. టీ పార్టీ ఖర్చు- ఇద్దరకూ చెరొక జత కొత్తదుస్తులు, ఆ రోజు చిన్న తలంటు పోసుకుని శుభ్రంగా తయారవటం వరకే -

ఈ మతం, సంప్రదాయపు సంకెళ్ళను వదిలించుకున్న ఓ నవతరం వధూవరులను చూస్తుంటే "జలసీ"గా వుంది. అయితే సాంప్రదాయిక వివాహాల్లో కష్టాలు పెళ్ళయాకే నిజంగా ప్రారంభమవుతాయి. విప్లవ వివాహాల్లో పెళ్లి అయ్యేవరకూ చాలా యాతనా ఇబ్బందులు వుంటాయి. మొట్ట మొదట విరోధం పెద్దవాళ్ళతో అంటే తల్లిదండ్రులతో అన్నదమ్ములతో యింకా చుట్టాలతో వస్తుంది. ప్రేమికులను నిలదీయటానికి చాలా కుట్రలు జరుగుతాయి. సాధారణంగా ప్రేమ వివాహాలు కులాంతరాలు కావటం వలన హెచ్చుతగ్గుల్ని ముందుకుత్రోసి ఒక పెళ్ళిపాడు చేసినా చాలని సంతోషించేవారు చాలామంది వుంటారు. ఇలా పెళ్ళిళ్ళు సింపుల్‌గా జరుగుతున్నాయని ఓసారి నేను మా పెద్దవాళ్ళతో అనగానే - ఆయన ముఖం కళ్ళూ ఎర్రబరుచుకుని ఎంత నీచంగా మాట్లాడాలో అంతా అనేశాడు.

"వీళ్ళు ఎల్లాగూ విడిపోతారు. అది వీడ్ని వదిలేసి ఎల్లాగూ లేచి పోతుంది."

"దానికి ముందు కడుపయ్యుంటుంది.... లేదా మనవాడు ముందే దాన్ని ఎంగిలి చేసుంటాడు." ఇలాటి మాటల్లో ఎంత అసహనం, కసి వుంటుందో చెప్పనలవికాదు. ప్రేమ వివాహాలు చేసుకున్న వాళ్ళని చిన్న చూపు చూసి అవమానించటం సమాజానికి జన్మహక్కు. పెద్దవాళ్లు సంప్రదాయం పేరిట ధనాశతో చేసే పెళ్లిళ్లు పెళ్ళిళ్ళనీ మిగతావి "లేచిపోవడాలలాటివ"ని వారి అభిప్రాయం. మార్పుపట్ల సొసైటి భయపడి క్రొత్త విధానాలను శంకించి అవమానించటం చాలా సహజం. కాని పెళ్ళిళ్ళు గిత్తల బేరాలు కావని, ఆస్తులు దోచుకోడానికి అవకాశాలు కారాదని, వ్యక్తిత్వాలు మనసులు ప్రధానమని ఈనాటి కుర్రవాళ్ళు కళ్ళముందు రుజువు చేస్తున్నారు.

కాని వాళ్ళ కష్టాలు అంటే – పెళ్ళికిముందు వారు లోనయినవి కొన్ని వింటూంటే వారి సాహసాన్ని అభినందించకుండా వుండలేం. ఈ వివాహాల్లో పెళ్లిఖర్చు వాళ్ళే పాపం పెట్టుకోవాలి. ఎవరి పెళ్ళిళ్ళు వారు చేసుకుంటే ఎదుర్కొనే యిబ్బందులు కొన్ని వుంటాయి. స్నేహితుల మీదే ఆధారపడాలి. ప్రేమికులు పూలదండల పెళ్ళిగాకుండా పీటలమీద పెళ్ళి చేసుకోవాలనుకునే వారిపాట్లు నాకు తెలుసు, కన్యాదానం పీటలమీద కూర్చునేందుకై పనికొచ్చే దంపతుల కోసం వేటాడ్డం నేనెరుగుదును. కొందరు పెళ్లిచేసుకోవాలనుకుని వచ్చి మనల్ని వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడి పెట్టకమంటారు. కొంతమంది ఆడపిల్లలు తల్లిదండ్రులను వదులుకోలేరు, విప్లవ వివాహానికి నిలబడలేరు, వాళ్ళకు సంప్రదాయ వివాహంలో జరిగే తంతు అంతా వుంటే బావుణ్ణని వుంటుంది. కుటుంబం కలిగించే రక్షణ నుంచి బయటకు రావాలంటే "కలేజా" వుండాలి. ముఖ్యంగా ఆర్థికంగా తమ కాళ్ళమీద తాము నిలబడగలమనే భరోసా లేకుండా పూలదండల పెళ్ళిళ్ళకు దిగరాదు. ప్రేమ వివాహాల్లో మధ్యవర్తిత్వం చెయ్యటమంత థాంక్‌లెస్ జాబ్ మరోటిలేదు. పెళ్ళి చేసుకున్న వారూ రేపు తేడాలొస్తే మనల్ని తిడతారు. ఇహ పెళ్లికూతురి పెళ్ళికొడుకుల బంధువులు సరే సరి, కాని ఎవరో ఒకరు పిల్లిమెడలో గంటకట్టక తప్పదు.

వివాహానికీ యుద్ధానికీ అట్టే తేడాలేదు, ప్రేమ వివాహానికి ముందు యుద్ధం తప్పనిసరి. అయితే ఈ ప్రేమికుల వివాహానికి పూర్వం జరిగే యుద్ధంలో బందీలు కావటానికి ఒప్పుకునేది వధూవరులే. మేం స్వేచ్ఛగా పెళ్ళిచేసుకొంటున్నామనుకొంటూ ఇచ్ఛికంగా ఒకరి కొకరు బందీలయి పోతారు.

ఒక డాబామీద పూలదండల పెళ్ళి అయింది. ఇద్దరూ ముచ్చటగా ముద్దుగా వున్నారు కళకళలాడుతూ. ఆ అమ్మాయి వచ్చి "ఇపుడు మేం ఏం చేయాలండీ" అని అమాయకంగా అడిగింది. "ఇవిగో తాళం చెవులు, మా ఫామిలీ ఇక్కడలేదు. మా ఇంటికి వెళ్ళండి. చీపురుతో గది శుభ్రం చేసుకుని, కూజాతో నీళ్ళు పట్టుకుని, ఫాన్ వేసుకుని చాపలు పర్చుకుని నిద్రపోండి" అని పెళ్ళి చేయించిన స్నేహితుడు మేటరాఫ్ ఫాక్ట్‌గా చెప్పి "హోటల్లో భోంచేసి వెళ్లండి" అని ఆదేశించాడు.

కొత్త పెళ్ళికొడుకు చాపలు మార్చటం, ఆ అమ్మాయి చీపురుతో గది చిమ్మటం, నీళ్లు పట్టటం బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా ఆ గదిలో తను మొదటిరాత్రి గడపటాన్ని ఊహించుకుంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాని తప్పదు - విప్లవ వివాహంలో యిలాటి కష్టాలెన్నిటినో సంతోషంతో స్వీకరించి ముందంజ వేయాలిసుంటుంది.

సంఘాన్ని ఎదిరించి పెళ్లి చేసుకున్నవారు వారి పడగ్గదిని వారే చీపురుతో శుభ్రం చేసుకోవాలి... ప్రేమించి పెళ్ళిచేసుకో అనేవారే కాని చేసేవారెవరూ తోడుండరు గనుక - సంఘాన్ని మరమ్మత్తు చేద్దామనుకునే వారెవరూ సంఘం నుంచి "ఫేవర్సు" పొందలేరు. పూలజడలూ, పట్టుచీరెలూ, ఒడ్డాణాలు, కాసులపేర్లు, గుఱ్ఱంమీదెక్కి ఊరేగింపు అవాలనుకునే వారెవరూ ప్రేమించి పెళ్లి చేసుకోగూడదు. ఏంచేతనంటే "ప్రేమ" మన వివాహాల్లో జనించదు గాక జనించదు. మన పెళ్లితంతు ప్రేమలకు వధ్యశిల. వివాహాన్ని సామరస్యంగా చూసి ప్రేమను భద్రంగా కాపాడుకోగలిగిన వారి దాంపత్యాలే విజయవంతమవుతాయి.

# సమ్మరోపాఖ్యానం

"ఏవండీ అంతా కులాసా?"
"ఆ ఏం కులాసా లెద్దురు"
"అదేవిటి అట్లా అంటున్నారు?"
"ఎండలండీ ఎండలు-"
"నిమ్మకాయ షర్బత్తులు తాగండి."
"ఆ ఏం నిమ్మకాయ పోనిస్తురూ-"
"షోడాల్తాగండి"
" ఆ ఏవిషోడాలు? అవీ వెచ్చగా వుంటాయ్"
"పోనీ కూల్డ్రింక్సులు తాగండి"
"కూల్డ్రింక్సులు మాత్రం తాగినంతసేపే నోరు చల్లబడేది - మళ్ళీ గొంతుకెండిపోవడమే."
"పోనీ మంచినీళ్ళు త్రాగండి".
"ఏం మంచినీళ్ళు. కూజాలోవి కూడా చల్లగా వుండటం లేదు."
"పోనీ కుండ కొనండి కుండ - కుండ."
"కుండలూ కూజాలూ కాపాడవండీ - ఎండలు - ఎండలు-"
"మజ్జిగ యింత ఉప్పేసుకుని త్రాగేస్తే ...."
"ఎన్నిమాట్లు త్రాగమంటారు?"